క్లుప్తంగా

జలహారతి



ఏర్పేడు చెరువుకు జల హారతి

ఏర్పేడు: ఏర్పేడు చెరువు నిండడంతో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య సోమవారం జలహారతి ఇచ్చారు. గతంలో మల్లిమడుగు రిజర్వాయర్ నుంచి నీటిని తెస్తే చెరువు నిండేది. ఈ ఏడాది వర్షానికి చెరువు నిండి కలుజు పారడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సాంబయ్య, కృష్ణయ్య, పవన్, షణ్ముగం, వెంకటముని, భక్తవత్సలం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిపాయి దాతృత్వం



నగదును అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో గోడ కూలి మృతిచెందిన బాలుడి కుటుంబానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నగదును అందించి దాతృత్వం చాటుకున్నారు. ఆదివారం భారీ వర్షాలకు ఎస్టీ కాలనీలోని పూరిగుడిసె గోడ కూలి శ్రీనివాసులు, కావేరి దంపతుల రెండో కుమారుడు యశ్వంత్(4) మృతిచెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5 వేలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత నారాయణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చీరాలకు చెందిన నంబూరు నారాయణ తన భార్య విజయలక్ష్మి జ్ఞాపకార్థం రూ.లక్ష అందజేశారు. నగదును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎస్టీ కాలనీల్లో భోజనాలు



భోజనం వడ్డిస్తున్న పవిత్రారెడ్డి

ఏర్పేడు: తుపాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న ఎస్టీ కాలనీ వాసులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి సోమవారం భోజనాలు అందజేశారు. గోవిందవరం, పాగాలి, వెంకటాపాలెం, చిందేపల్లి తదితర ఎస్టీ కాలనీల్లో ఆమె పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల్లో నీటమునిగిన వరి, నారుమడులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి తరలించాలని సంబంధిత అధికారులను కోరారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్ బాలప్రసాద్ యాదవ్, నాయకులు మునిరత్నం నాయుడు, శేఖర్ నాయుడు, మహేష్, సుబ్రమణ్యం, వేణు, పెంచలరెడ్డి ఉన్నారు.

పరమేశ్వరునికి అన్నాభిషేకం



రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో వెలసిన శ్రీకామాక్షీ సమేత మూలస్థానేశ్వర ఆలయంలో కార్తికమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకుడు జువ్వల ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం చందనాభిషేకం, 108 కలశాలతో జలాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా పుష్పాలంకరణ చేశారు. మూలవిరాట్‌కు పండ్లు, వివిధ ఆహార పదార్థాలతో అలంకరించారు. అన్నాభిషేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

జల విలయం

- జల దిగ్బంధంలో పలు గ్రామాలు
- పొంగుతున్న వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు
- తిరుపతి విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు పూర్తిగా రద్దు
- మల్లిమడుగు డ్యాంలో 12 గేట్లు ఎత్తివేత



ఆర్.మల్లవరంలో పంటపొలాల్లో వర్షపు నీరు



రేణిగుంట: వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీ పునరావాస కేంద్రంలో బాధితులు



నిండిన మల్లిమడుగు ప్రాజెక్టు

పిచ్చాటూరు: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. తెపాన్ ప్రభావంతో పిచ్చాటూరు మండలంలో భారీ వృక్షాలు నేలవాలాయి. ఉదయం నుంచి విద్యుత్ అంతరాయం కలిగింది. రోడ్లకు అడ్డంగా భారీ వృక్షాలు నేలవాలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అరణియార్ గేట్లు ఎత్తడంతో ఎదురుగా ఉన్న కాజ్ వేపైకి వరద నీరు పోటెత్తింది. దీంతో పిచ్చాటూరు-శ్రీకాళహస్తి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వేకు ఇరువైపులా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను రామగిరి వైపు మళ్లించారు. చెంచురాజు కండ్రిగ వద్ద గొడ్డేటి వాగులో వరద పోటెత్తడంతో చెంచురాజుకండ్రిగ, సిద్ధిరాజుకండ్రిగ మధ్య రాకపోకలను నిలిపివేశారు. బంగాళ, ఎస్ఎస్‌బి పేట, పులికుంద్రం, శ్రీరామాపురం చెరువులతో పాటు అన్నీ చిన్న చెరువులు పూర్తి స్థాయిలో నిండినట్లు ఏఈ శివబాల తెలిపారు. గోవర్ధనగిరి ఎస్సీ కాలనీ, ఎస్ఎస్‌బీ పేట గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరాయి. కీళపూడి పెట్రోల్ బంక్, శ్రీకాళహస్తి రోడ్డుపై భారీ వృక్షాలు నేలవాలి రాకపోకలకు అంతరాయం కలిగింది.

తుపాన్ బీభత్సం

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి, నచ్చనేరి, రాజులపాలెం, పల్లం తదితర ఎస్టీ కాలనీల్లో పూరి గుడిసెలు నేలకూలడంతో నిరాశ్రయులయ్యారు. అంజిమేడు, కృష్ణగిరి కాలనీ, మాధవమాల, మన్నసముద్రం, ముసలిపేడు, గుడిమల్లం, చింతలపాలెం, తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కోబాక, కొత్తవీరాపురం, కుమ్మరికండ్రిగ, మోదుగులపాలెంలో వరి నీట మునిగాయి. కొత్తవీరాపురం, గోవిందవరం గ్రామాలకు సమీపంలోని స్వర్ణముఖి నదిపై ఉన్న కాజ్‌వేలు, అంజిమేడు సమీపంలోని బండమానివాగు, గుడిమల్లం శీతకాల్వ తదితర గ్రామాల్లో నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. రాకపోకలు స్తంభించాయి. మండలంలోని 86 ఇరిగేషన్ చెరువులు, 56 ఊట గుంటలు జళకలను సంతరించుకున్నాయి. సదాశివకోన రిజర్వాయర్ నిండుకుండలా మారింది. ఇసుకతాగేలిలో రైతు చెంగారెడ్డి 3 ఎకరాల బొప్పాయి తోట నేల కూలింది.

జనజీవనం అస్తవ్యస్థం

రేణిగుంట: మండలంలో జనజీవనం పూర్తిగా స్తంభించింది. రేణిగుంట విమానాశ్రయం రన్‌వేపై నీళ్లు చేరడం, వాతావరణం అనుకూలించకపోవడం వల్ల సోమవారం రేణిగుంట నుంచి నడిచే 18 విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మంగళవారం కూడా విమాన సర్వీసులు రద్దు అవుతాయని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. కరకంబాడి సమీపంలోని మల్లిమడుగు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండడంతో 12గేట్లు తెరిచి నీటిని బయటకు వదిలారు. వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో 14 కుటుంబాలకు చెందిన 44మందిని ప్రాథమిక పాఠశాల భవనంలోకి తరలించి వారికి ఆహారం అందజేశారు. అలాగే ఆర్.మల్లవరం ఎస్టీ కాలనీకి చెందిన రెండు కుటుంబాలను హైస్కూల్ భవనంలోకి తరలించారు. గాజులమండ్యంలో రోడ్డుపై చెట్టు కూలిపోవడంతో కొమ్మలను కట్‌చేసి రాకపోకలను క్రమబద్ధీకరించారు. తారకరామానగర్‌లో ఇళ్ల మధ్య చేరిన వర్షపు నీటిని జేసీబీ సాయంతో కాలువలకు మళ్లించారు. కుర్రకాల్వ పద్మనగర్‌లో పలు ఇళ్లు నీట మునిగాయి.



ఏర్పేడు: కృష్ణగిరి కాలనీలో నేలకొరిగిన చెట్టు



పిచ్చాటూరు: కీళపూడిలో రోడ్డుపై..



కలుజు పారుతున్న సదాశివకోన రిజర్వాయర్

జలదిగ్బంధంలో వరదయ్యపాళెం



పెద్ద పాండూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు

- 2,500 ఎకరాల్లో నీట మునిగిన వరి పంట
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



గోవర్ధనపురంలో రోడ్డుపై సున్నపుకాలువ ఉధృతి



బత్తలవల్లం అపార్ట్‌మెంట్ వద్ద నీట మునిగిన కారు

వరదయ్యపాళెం: భారీ వర్షాలకు వరదయ్యపాళెం జలదిగ్బంధనలో చిక్కుకుంది. మండలం చుట్టూ ఉన్న వాగులు, వంకలు, చెరువులకు పెద్దఎత్తున వరదనీరు చేరడంతో ఎటు చూసినా జలమయమే. సోమవారం సాయంత్రం వరకు 239.4మి.మీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. గోవర్ధనపురం వద్ద సున్నపు కాలువ, కడూరు కూడలిలోని మారేడు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో శ్రీకాళహస్తి-తడ ప్రధాన మార్గం, సంతవేలూరు మార్గం, పెద్ద పాండూరు-తొండంబట్టుకు మార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు అత్యవసర పరిస్థితులకు బయటకు రాలేని పరిస్థితి. మండల వ్యాప్తంగా 2500 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి సుహర్‌లత తెలిపారు. ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. 30 నుంచి 50 విద్యుత్ స్తంభాలు నేల కూలినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని గోవర్ధనపురం, మత్తేరిమిట్ట, వీకేఆర్‌వైకాలనీలో 600 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. మండలంలోని అంబూరు, మరదవాడ చెరువులు వరదనీటి ఉధృతికి ప్రమాదపుటంచులో ఉన్నాయి. వైద్యసేవలు అందించడం కోసం వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నారు.



వరదయ్యపాళెం: చిలమత్తూరు చెరువు

స్తంభించిన జనజీవనం



పాలీశ్వర ఆలయంలో చేరిన వర్షపు నీరు



తుంబూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న అరుణానది

నారాయణవనం: అరుణానది పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. 11 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మొరువ పారుతున్నాయి. వర్షాలకు 6 ఇళ్లు కూలిపోయాయి. సుమారు 125 ఎకరాల్లో వేరుశనగ పంట నీట మునిగింది. ఆదివారం రాత్రి నుంచి అరుణానది పుర్తి స్థాయిలో ప్రవహించడంతో తిరువట్యం కాజ్‌వేపై రాకపోకలు ఆగిపోయాయి. తుంబూరు లోలెవల్ కాజ్‌వే కోతకు గురైంది. పాలమంగళం సౌత్ దళితవాడ వీధుల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలమంగళం నార్త్ పాలీశ్వరఆలయంలో రెండు అడుగుల వర్షపు నీరు చేరింది. కైలాసనాథకోన జలపాతంలో నీటితో పాటు రాళ్లు, విష సర్పాలు పడుతుండడంతో స్నానాలను నిషేధించాలని తహసీల్దార్ ప్రమీల ఆదేశించారు. నారాయణవనం, తిరువట్యం, తుంబూరు, సముదాయం, పాలమంగళం నార్త్‌ల వద్ద లెవల్ కాజ్‌వేల వద్ద అరుణానదిలో ఎవరినీ దిగకుండా పోలీసులు వలంటీర్ల సహకారంతో గస్తీ ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం మూడు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు.

పొంగి పొర్లుతున్న చెరువులు



కలుజు పారుతున్న నీర్పాకోట చెరువు

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్ ప్రభావంతో బీఎన్ కండ్రిగలో 32 చెరువులు నిండి కలుజు పారుతున్నాయి. పలు చెరువులు ప్రమాదం అంచున ఉన్నాయి. గండ్లు పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో చెరుకు, వరి, మినుము పంటలు నీట మునిగాయి. 150 ఎకరాల్లో చెరుకు, 2 వేల ఎకరాల్లో వరినారు, 1500 ఎకరాల్లో వరి, 170 ఎకరాల్లో మినుము దెబ్బతిన్నాయి. పంటపొలాలు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. పలు చోట్ల గ్రామీణ రోడ్లు దెబ్బతిన్నాయి. కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తగా చెరువు కొనకట్టను తెగొట్టి నీటిని వదులుతున్నారు. ఆలత్తూరు, కుక్కంబాకం, కారణిమిట్ట, గాంధీగిరిజనకాలనీ, మొక్కలచేను, సుద్ధమిట్టగిరిజనకాలనీ, తహానగర్ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.



నీర్పాకోట చెరువు కాలువ



కనమనంబేడు చెరువు నుంచి పారుతున్న నీరు

వరద బాధితులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



అరణియార్ గేటు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు/వరదయ్యపాళెం: భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టం నుంచి కోలుకునే విధంగా అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సహాయక చర్యల్లో విస్తృతంగా పాల్గొనాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆదివారం నియోజకవర్గంలోని 7 మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ఐలతో టెలిఫోన్ ద్వారా వర్షాభావ పరిస్థితులు, జరిగిన నష్టాల గురించి తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ ఇబ్బందులు తలెత్తాయో వాటి గురించి కలెక్టర్‌కు నివేదించారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రోడ్ల వెంబడి కూలిపోయిన చెట్లను తక్షణమే తొలగించే దిశగా ఎస్ఐలు తమ వెంట జేసీబీలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఎంపీడీఓలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వర్షం తగ్గుముఖం పట్టిన తక్షణమే జరిగిన నష్టాన్ని గ్రామస్థాయిలో అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. నీట మునిగిన లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రజలు అధైర్యపడకుండా వర్షాల సమయంలో బయటకు రాకుండా ఇళ్లకే పరిమితం కావాలని కోరారు.

వాన జోరు.. ప్రజల బేజారు



కారాకొల్లు వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్, డీఎస్పీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో సోమవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీకాళహస్తి ముచ్చివోలు మార్గంలోని ఉడమలపాడు వద్ద వాగు రోడ్డుపై పొంగి ప్రవహిస్తోంది. గంగలపూడి మార్గంలోనూ అదే పరిస్థితి. కారాకొల్లు మార్గంలో వాగు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలు ఆగిపోయాయి. తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు పరిశీలించారు. పిచ్చాటూరు మార్గంలోని రామచంద్రాపురం వద్ద రోడ్డుపై చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు చెరువు, తొట్టంబేడు మండలం పెద్దకన్నలి చెరువు పూర్తిగా నిండిపోవడంతో కలుజులు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. కొండ్రాజుపల్లిలో తాటిచెట్టు కూలడంతో నవీన్‌కు చెందిన ఇంటితోపాటు పక్కన మరో రెండు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెర్లోపల్లి ఎస్టీకాలనీ, చటర్జీనగర్ కాలనీల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ఇబ్బందులు తప్పడంలేదు. అమ్మపాళెంలో రెండు రోజుల క్రితం పోసిన నారుమళ్లలో విత్తనం కుళ్లిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నాగలాపురంలో రోడ్డుపై కూలిన చెట్టు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



స్వర్ణముఖి నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి/ఏర్పేడు: తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరమేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణం, ఏర్పేడు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్వర్ణముఖి నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో పునరావాస కేంద్రాలకు వచ్చే ప్రజలకు తాగునీరు, ఆహారంతో పాటు వసతి సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే ఏర్పేడు మండలంలోని కొత్తవీరాపురం కాజ్‌వేను పరిశీలించారు. తుపాను ప్రభావంతో కాజ్‌వేలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. కాజ్‌వేల వద్ద పోలీసుల గస్తీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని సూచించారు. ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా తక్షణమే డయల్ 100, 112, 8099999977 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు గిరిధర్, భవ్య కిషోర్, బీమారావు ఉన్నారు.

శ్రీకాళహస్తిలో లోతట్టు ప్రాంతాలు జలమయం



శ్రీకాళహస్తి సన్నిధివీధిలో వరద నీరు



కొత్తవీరాపురంలో ఇంట్లోకి చేరిన నీరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది. స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. జయరామరావువీధి, సన్నిధివీధి, పూసలవీధి, కొత్తపేట, పీవీరోడ్డు, పెండ్లిమండపం, బీపీ అగ్రహారం, శ్రీరామ్‌నగర్‌కాలనీ, దక్షిణ కైలాస్‌నగర్‌కాలనీలు జలమయం అయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

కొత్తవీరాపురంలో వరదనీరు

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం జలదిగ్బంధంలో చిక్కుకుంది. స్వర్ణముఖి నది నిండడంతో సరిహద్దులోని ఈ గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. ఇళ్లల్లోకి నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వారిని పునరావాస కేంద్రానికి తరలించేందుకు తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీఓ గిడ్డయ్య, సీఐ శ్రీహరి ఏర్పాట్లు చేశారు.

ఏడు గంగమ్మల జాతర ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి: పట్టణంలో ఏడు గంగమ్మల జాతర ఏర్పాట్లను సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న ఏడుగంగమ్మల ఆలయం వద్ద ఆయన మాట్లాడారు. ఏడుగంగమ్మల జాతర బుధవారం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ, రంగవల్లులు, శానిటేషన్ వంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున సారె సమర్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. అంజూరు బాలసుబ్రహ్మణ్యం, స్వర్ణమూర్తి, పగడాల రాజు, మొగరాల గణేష్ ఉన్నారు.